సాయంకాలమైంది. ఎండ పొగలు చిమ్మి అలిసిపోయిన రోజు గడిచిపోయింది. వీధులన్నీ సాయం కాలపు సువాసనల్తో గుబాళిస్తున్నాయి. హోటళ్లలో, పార్లర్లలో, షోరూమ్లలో, థియేటర్లలో పెరుగుతున్న తొక్కిసలాట మధ్య నుంచి ఒంటరిగా తోవ చేసుకుంటూ బయటపడ్డాను. ఇది రైల్వే లైను. ఈ బ్రిడ్జి కింద పాత ఇటుక గోడ. దాని చుట్టూ అల్లుకున్న ఎర్రపూల తీగెలు. రోడ్డు ఒంపున కట్టిన స్టోన్ రివెట్‌మెంట్ మీంచి కిందికి దిగితే మహరాజా అలక్ నారాయణ్ కాలనీ.

రైల్వేలైన్‌కి అటువైపు విశాఖపట్టణం పోయే రోడ్. నిరంతరం రద్దీతో, ఇటువైపు రాయపూర్ వెళ్లే నెం.43 నేషనల్ హైవే. ఆ రోడ్డుని చూడగానే ఘాట్ రోడ్ల ఒంపులు, దండకారణ్యం, మజ్జిగౌరి జాతర, ఆదివాసీలు, పార్వతీపురం కుట్ర కేసు — గాఢమయిన ఎసోసియేషన్స్ అడవి పువ్వుల గాలిలాగా ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. పక్కకు దిగి ఎర్రని మట్టి బాటపైన రైల్వే లైను వెంబడే అడుగులు వేస్తుంటే ఒళ్లంతా నిలవనీయని మహామధుర మోహప్రకంపనలు. ఆ ముందు లైన్లలో ఎన్ని అడుగులు నడిస్తే ఆ ఇంటి ముందు నిల్చుంటానో స్పష్టంగా తెలుసు.

# అమృతం

## - వాడ్రేవు చినవీరభద్రుడు

ఆ ఇంటి చిన్ని కాంపౌండ్ గేటు పైనతుప్పు పట్టిన ఆకుపచ్చ రంగు ఇనుపరేకుపైన ఇంటి నెంబరు తెల్ల అంకెల్లో. కుండీల్లో పెద్ద ఆకుల జొంపాల మధ్య ఎర్రనివీ, పచ్చనివీ కనకాంబరాలు. మేడపైకి ఒంపు తిరిగిన స్పైరల్ స్టెయిర్స్‌ని ఆనుకునే బాల్కనీలోకి అందమయిన లతలా ఆప్యాయంగా చేతులు చాపినట్టు అల్లుకున్న సన్నజాజి తీగా, ఆ ఇంట్లో నిజంగానే ఒక అందమైన యువతి ఆప్యాయంగా చాచిన చేతుల కోసమే నా ఈ జీవితం.

రోజల్లా నేను గడిపిన జీవితంలో ఏ క్షణమూ నాది కాదు. నేను కలిసిన, మాట్లాడిన మనుషుల్లో ఎవ్వరూ నాకేమీ కారు. ఉదయం నుంచీ దినమల్లా కాలేజిలో నేను పడ్డ శ్రమ అంతా లోకానికి బాకీ తీర్చేసుకున్నట్టుగా అనుకుంటాను. ఇప్పుడింక ఈ రోజుకి అన్ని బరువుల నుంచీ విడుదలయి నాదయిన జీవితాన్ని స్వీకరిస్తాను. అనేక వేల మంది నివసించే ఈ పట్టణంలో వేయి విధాల వేయి పథాల విస్తరించే కార్యకలాపమంతటిలోనూ నాకు నాదీ అని చెప్పుకోదగింది ఈ యువతి నివసించే ఈ అద్దె ఇంట్లో ఈ బాల్కనీ పైన ఈ సన్నజాజి గుబురు నీడన ఈ కాస్త స్థలమే, ఈ కాసిని క్షణాలే.

గేటుపైన చేతులు వేసి తియ్యబోతూండగానే, నా దేహాంతర్భాగాలన్నిటా రక్తం ఒక్కసారి జివ్వుమంటుంది. ఆ మూసి వున్న తలుపుల వెనక, ఆమె ఇంకా తన ట్రయినింగ్ ఇన్‌స్టిట్యూట్ నుంచి వచ్చి వుందో లేదో లేక ఎవరన్నా ఫ్రెండ్‌తో షాపింగ్‌కి వెళ్లిందో, లైబ్రరీకి వెళ్లిందో అన్న టెన్షన్. ఎంతో పదిలంగా కూర్చుకున్న ఈ కొద్ది క్షణాల్లో వెయిటింగ్ ఒక దయలేని రంపపు కోత. గేటు ఇనపగొళ్లెం చప్పుడు అయీ అవకుండానే కిటికీ రెక్క తెరచుకుంటుంది. తెరచిన మేరకంతా ఫ్లోరసెంట్ దీపపు కాంతి. చీరె చింపి కట్టిన ఆ నైలాన్ పరదా తప్పించుకుని ఆ కళ్లు కనిపించేదాకా - హింసపెట్టే ఆతృత. ఒక్క క్షణంలో మనిషి
వేయిసార్లు మరణించి వేయిసార్లు పునర్జీవించే ప్రక్రియ ఎలా వుంటుంది!

కాని అది ఈ ఒక్కచోటే. ఈ సువిశాల ప్రపంచంలో ఇంత సుదీర్ఘ కాలమానంలో, నువ్వు జీవించి వున్నావని, జీవించి వున్నందుకు హర్షాతిశయంతో నీకు స్ఫురించేది ఇప్పుడే. రోజల్లా గొంతు చించుకుని క్లాసులు తీసుకుంటానా, కాని ఏ క్లాస్‌లోనూ, ఏ విద్యార్థి ముఖంలోనూ ఏ వెలుగూ కన్పించదు. క్లాస్‌లోకి రాగానే. బిగదీసుకుని, టెక్స్ట్‌బుక్స్ పేజీలకి కుక్క చెవులు మెలిపెడుతూ నిర్లిప్తంగానో, పరధ్యానంగానో బెల్ ఎప్పుడు మోగుతుందా అని ఎదురుచూస్తూ వుంటారు. హోటల్‌కి వెళ్ళు, పార్క్‌కి వెళ్ళు, చివరికి లైబ్రరీకి వెళ్ళు, గడియారం లోంచి ఇసుక
జారిపోయినట్టుగా కాలం గడిచిపోతుందే తప్ప, ఒక్క క్షణమన్నా ఉజ్వలంగా ఒక మెరుపులాగా ప్రదీపమానంగా తోచనే తోచదు.

కానీ ఈ ఒక్క చోట తప్ప...

"నాలో ఏ ప్రత్యేకత వుందని? నువ్వు చూసే అందమంతా నాలో లేదు, నీ మనసులో వుంది. నువ్వు పొందే ఆనందమంతా నా వల్ల కలిగింది కాదు, నీ మనసు కల్పించుకున్నది" అంటుంది శ్యామల. ఆ మూడక్షరాల పేరూ నా జీవితాన్ని కుదిపివేస్తున్న అస్తిత్వానికి సంకేతం అవాలి.

తలుపు తెరుచుకుని వెళ్లడం వెళ్లడం నేను మెట్లు ఎక్కి బాల్కనీ పైకి పోయి కూచుంటాను. ఆకాశపు నాలుగు కొసల నుంచీ నక్షత్రాలూ, సన్నజాజి గుబుర్లలో మొగ్గలూ ఒక్కసారే విప్పారుతోండగానే, ఆ ఒంపు తిరిగిన మెట్లపైన ముందు ఒక దూర సందేశం లాగా అడుగుల చప్పుడు ఆ పైన మెట్టు మెట్టుకీ మోగే మువ్వల

పట్టీల పలకరింపు, ఇక ఒక కనురెప్పపాటులో ప్రత్యక్షమవుతుందనగా ముందుగా కనిపించే ఆ పొడుగాటి జడా. ఆ ముంగుర్ల మధ్య నుంచి వూగాడే లోలకులూ, ఆ పైన అప్పుడే వాలిన కాటుక పిట్టల్లాంటి కళ్లతో నిశ్శబ్దపు ఒల్లరిలో రెప్పలాడిస్తే, ప్రతి కదలికా ఒక కెరటంలా ఆమె.

ఇక ఆమె వచ్చి ఎదట కూచోగానే, ఏదో ఒక అపూర్వమయిన ట్రాన్స్‌లాగా ఆవహిస్తుంది నన్ను. ఇంతదాకా శూన్యంగా వున్న నా జీవితావరణంలో ఒక రేడియంట్ ప్రెజెన్స్.

"ఏమిటి? ఏమీ మాట్లాడవు"

ఏమనాలో తోచక సిగరెట్ తీసి వెలిగిస్తాను. సాయం కాలపు నీడ వాలులో మృదువుగా ప్రవహించుకుంటూ పోయే సెలయేటి ఒడ్డున పచ్చిక తిన్నెపైన ఏకాంత నిశ్శబ్దం ఎలా వుంటుంది. కాని దిన్ను అంతకన్నా మూగవాణ్ణి చేసే గంభీరమయిన సాన్నిధ్యం ఇది.

"సిగరెట్ నేను తాగుతున్నట్టుంది..."

ఆమెకీ నాకూ మధ్య పలచని మబ్బులాగా సిగరెట్ పొగ

"ఈ ఒక్క అలవాటూ మానుకోలేవూ నువ్వు"

"ఈ ఒక్క అలవాటే కదా వుండనివ్వరాదా"

ఈ వివాదం తెగదు. ప్రతి రోజూ ఈ మాటలు సాగుల్సిందే. కాని ఆ క్షణాల్లో ఆ సిగరెట్ కూడా లేకపోతే, నాలోని బేస్, వైల్ ఫోర్సెస్ నేటివో కాల్చి పొగగా చేసి నన్ను శుద్ధి చేసే ఆ ఔట్‌లెట్ కూడా లేకపోతే?

"పూర్వం ఎన్ని మాటలు మాటాడే వాడివి, గంటల తరబడి. ఇప్పుడసలు మాటలే కరువయినట్టు కూచుంటున్నావు."

ఆమె పరిచయమయిన తొలి రోజులు గుర్తొచ్చాయి.

ఇక్కడ అప్పుడే కొత్తగా పార్ట్ టైం లెక్చరర్‌గా జాయినయ్యాను. ఒకటి రెండు నెలలు కాకుండానే ట్రయినింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో కూడా సైకాలజీ క్లాస్‌లు తీసుకోమని పిలిచారు. అదీ కొన్ని రోజులే. ఆ తర్వాత ఇన్‌స్టిట్యూట్‌లో ఆ సబ్జెక్ట్‌కి పూర్తి టైం లెక్చరర్ నియామకం జరిగిపోయింది. కాని ఆ కొన్ని రోజుల పాఠాలకీ ఇంప్రెస్ అయి కొంతమంది స్టూడెంట్స్ ట్యూషన్స్ తీసుకొమ్మని అడిగితే ఒప్పుకున్నాను.

అటు డిగ్రీ కాలేజిలో పని ఒత్తిడి పెరిగి, ఇటు ఇంతదూరం వచ్చి వీళ్లకి సాయంకాలాలు పాఠాలు చెప్పలేకా, మానుకుందామనుకుంటూండగా, నాకు తెలీకుండానే నన్ను కట్టిపడేసింది శ్యామల.

సాయంకాలాలు నా పాఠాల కోసం శ్రద్ధగా చూస్తుండేవారు ఆ స్టూడెంట్స్ అయిదారుగురు ఆడపిల్లలూ. ఇక్కడే ఈ గదిలోనే పిల్లల మనస్తత్వశాస్త్రం మీదా, విద్యాశాస్త్రం మీదా నేను వాళ్లకి నోట్స్ చెప్తుంటే, కొద్దిగా దూరంగా తలుపు వారగా చేతుల్తో మోకాళ్ళ పట్టుకుని ఓరగా తలవాల్చి నిర్లిప్తంగా చూస్తూ వుండేది సుమ్మర్సి శ్యామల. అవి, ఆమె తన ఇంటర్‌లో పోయిన పేపర్లలో మళ్లీ పరీక్షకు కూచుని, రిజల్ట్స్ కోసం ఎదురుచూస్తున్న రోజులు.

ఏ సాయంకాలమన్నా నేను వాళ్లకి పాఠాలు చెప్పడానికి వెళ్లడం వీలుకాకపోతే, ఏ పనిలోనో చిక్కుకుపోయి వుండగా, హఠాత్తుగా, మోకాళ్లపైన తలవాల్చుకుని, నిర్లిప్తంగా చూసే ఆమె కళ్ల జ్ఞాపకం వచ్చి విలవిల్లాడేది మనస్సు. ఆమె ఏమీ మాట్లాడకపోయినా, మళ్లీ ఆమెని మర్నాడు సాయంకాలం ఆ తలుపు వారగా చూసినదాకా నిశ్చింతగా వుండేది కాదు. నిర్లిప్తంగా వుండే ఆ కళ్లల్లో ఎదుటి మనిషిని నిలువునా చీల్చే ఒక పదునయిన దిగులేదో ప్రవహిస్తూ వుండేది.


ఆ పిల్లలు పరీక్షలు రాసి ఫేర్‌వెల్ పార్టీ పెట్టుకుని నన్ను పిలిచినదాకా వాళ్ళు వెళ్ళిపోతారనే తోచలేదు నాకు. ఆ పిల్లలతో అనుబంధం కలిగి కాదు. వాళ్ళు వెళ్ళిపోతే, ఆ ఇంటికీ నాకూ ఇక ఏ బాంధవ్యమూ వుండదని. ఆ ఇంటికి వెళ్ళకపోతే, ఆ కళ్ళని చూడకపోతే ఇక నా ఏ సాయంకాలానికీ అర్థం వుండదని.

వాళ్ళ ఫేర్‌వెల్ పార్టీకి వెళ్ళకూడదని, ఇక ఆ బాంధవ్యం నుంచి పూర్తిగా



బయటపడాలనీ ఎంతో గట్టిగా అనుకుని కూడా ఆ ఆఖరి రోజున వెళ్ళకుండా వుండలేకపోయాను. పార్టీ సందడిలో ఆ పిల్లలు 'మాష్టారూ, మీకో చిన్న మెమెంటో మా తరపున అందుకోండి" అంటూ ఒక కానుక నా చేతిలో పెట్టారు. ఇద్దరు చిన్న పిల్లల చిత్రం పోస్టర్. ప్లైవుడ్ ప్లాంక్ మీద ట్రాన్స్‌పరెంట్ రాపర్‌లో ఆ పిల్లలూ, వాళ్ళ మధ్య పరిచిన మేజా బల్లపైన వెలుగుతున్న కాండిల్, పువ్వులు, పళ్ళు మెరుస్తున్నాయి. ఆ పోస్టర్‌కి పై భాగంలో 'టు డబుల్ యువర్ జాయ్, డివైడ్ ఇట్ విత్ సమ్ ఒన్' అని కాప్షన్.

ఆ సందడి అంతా ముగిసిన వెనక, నేను బయల్దేరి వచ్చెయ్యబోతూండగా, ఆ స్టూడెంట్స్‌లో ఒకమ్మాయి "మాష్టారూ, మా శ్యామలకి ఇక్కడే సీటు దొరికింది. ఈ ఇంట్లోనే వుంటుంది. మీరు మర్చిపోకుండా వచ్చి చూస్తూండండి'" అంది. ఆ అమ్మాయి అలా ఎందుకన్నదో తెలీదుగానీ ఆ క్షణాన్న నేను నిజంగా అంతకు మించిన భాగ్యం వుంటుందను కోలేదు. కానీ, ఏమనాలో తెలీక, చిరునవ్వుతో "అయితే మరీ సంతోషం, ఈ అందమయిన కానుకని ఎక్కడ దాచుకోవా అని ఆలోచిస్తున్నాను ఇంతదాకా. ఇక ఈ గదిలోనే దాచుకుంటాను" అన్నాను. రాత్రి



ఆ పిల్లలు ఆ గదిలో గోడకి ఆ పటాన్ని ఫిక్స్ చేస్తుండగా చూశాను శ్యామలని. ఆ కళ్ళల్లో అదే నిర్లిప్తత, నిలువునా కాల్చే దిగులు.

ఆ మర్నాడు గానీ, ఆ తర్వాత కొన్నాళ్ళు గానీ ఆ ఇంటివైపు వెళ్ళడానికి సాహసించలేకపోయాను. ఒక సాయంకాలం వీధి కొసదాకా వెళ్ళి వెనక్కి వచ్చేశాను. ఒకరోజు పొద్దుటి పూట, ఇన్‌స్టిట్యూట్ పనిచేసే వేళల్లో, ఆ ఇంటిదాకా వెళ్ళి మూసివున్న ఆ తలుపుల్ని తదేకంగా చూసిచూసి వెనక్కి వచ్చేశాను. మరొకసారి సెలవు రోజు మధ్యాహ్నం మూడు నాలుగు గంటల వేళ ఆ వీధిలో అటూ ఇటూ పచార్లు చేస్తుంటే తెలిసిన ముఖం వాడు ఒకడు కనబడి, ఆ వేళప్పుడు నన్నక్కడ వూహించలేక, క్రూరమయిన ఇంక్విజిటివ్‌నెస్‌తో ఇంటరాగేట్ చెయ్యడంతో హడిలిపోయి కొన్నాళ్ళదాకా మరి అటు వెళ్ళలేకపోయాను. రోడ్డు మలుపులోంచి ఆ ఇన్‌స్టిట్యూట్‌ని చూసినా, ఎవరయినా ట్రయినీలని ఎక్కడయినా చూసినా, లైబ్రరీలో ఎడ్యుకేషనల్ సైకాలజీ, మెథడాలజీ పుస్తకాలు చూసినా ఏదో వివశత్వం లాంటిది కలిగేది. ఇదంతా ఎవరికేనా చెప్పుకోవాలని పించేది. కాని ఎవరికి చెప్పుకుంటే ఎవరు అర్థం చేసుకోగలరు? మా కొలీగ్స్‌లో కొంతలో కొంత సున్నిత మనస్కుడిగా పేరున్న ఒకాయనతో ఈ విషయాలు మాట్లాడాలనుకున్నాను. ఒక సాయంకాలం ఆయన్తో పాటు ఆ విషయం ఈ విషయం మాట్లాడుతూ నడుస్తూంటే, నాదయిన అపురూపమయిన ఏ అనుభూతినో ఇతనితో పంచుకోబోతున్నానన్న వూహే అతనంటే నాకెంతో ఇష్టాన్ని కలిగించింది. చెరువు గట్టున్న అకేషియా చెట్ల గుబుర్లలోంచి సాయంకాలపు ఎండ బంగారపు తునకలుగా రాలుతోంది. ఎంతో రహస్య మాధుర్యంతో నేను 'ఈ మధ్య నాకు ఒక అమ్మాయి పరిచయమయింది' అని మొదలుపెట్టి అనుకోకుండా అతని వంక చూశాను. అప్పుడతని కళ్ళల్లో కనిపించిన భావం - నన్ను నిలువునా నిస్సత్తువలోకి తోసేసింది. మరేమీ మాట్లాడలేకపోయాను. ఒక మగవాడు, ఒక స్త్రీ గురించి- ఆమె ఎంత ఉన్నతురాలయినా సరే, మరొక మగవాడితో ప్రస్తావించడమే నేరమనిపించింది. నీ నిద్రనీ, మెలకువనీ, కలల్నీ నిలువెల్లా వూగించే మనిషి గురించి వినడానికీ, విని భరించగలగడానికీ చాలినంత ఓపిక ఎవరికుంటుంది?

సాహసించి చివరకి ఒకనాడు, ఏమయితేనేం, ఆ ఇంటికి వెళ్ళి తలుపు తట్టాను. ఆమె వచ్చి తలుపు తీసి నన్ను చూసి తన కళ్ళను తానే నమ్మలేనట్టుగా ఆశ్చర్యపోయింది. ఆ క్షణాన్న ఆమె కళ్ళలోని ఆనంద విస్మయాన్ని నేనెన్నటికీ మరచిపోలేను. ప్రతి రోజూ ఈ గదిలో గంటల తరబడి కూచున్న నన్ను ఎంతో నిర్లిప్తంగా చూసిన ఆ కళ్ళు ఈ క్షణ కాలంలో ఎంత కాంతి భరితాలయ్యాయో నేను చెప్పలేను. అంటే ఇంతకాలం, ఇన్ని రోజులూ, ఇన్ని సాయం కాలాలూ ఆమె నా కోసం ఎదురు చూస్తూనే వుందా? ఎవరికీ అక్కర్లేని, ఎవరికీ ఏమీ కాని నా కోసం! నీ కోసం ఒక మనిషి ఎదురు చూస్తూ వుంటుందనీ, నువ్వు కనబడగానే ఆమె కళ్ళు కాంతితో మెరిసిపోతాయనీ నీకు ఒక్కసారిగా తెలిసిరావడం ఎంత అద్భుతంగా వుంటుంది! హఠాత్తుగా, నీ జీవితంలో ఇంతకాలం మూసుకుపోయిన తలుపు ఏదో ఒక్కసారిగా తెరుచుకుని ఒక ఆనంద మహా సముద్రమేదో తరంగితమవుతూ నీ ఎదట సాక్షాత్కరిస్తుంది. మోహాభరితమైన సుగంధ ద్రవ్యాల్ని నింపుకున్న ఓడలు ఒక్కొక్కటే నీ వైపు వస్తున్నట్లుగా వుంటుంది. కేవలం ప్రయోజన వంతమయిన జీవితం చాలుననుకునే మనుషుల మధ్య, అర్థవంతమయిన ఉద్దేశంతో ఒక ప్రియబాంధవి నీ జీవితంలోకి తనంతట తానుగా ప్రవేశించినట్టు వుంటుంది.

"ఏమిటి! ఆలోచనల్లో పడిపోయావు."

మృదువుగా నా భుజాన్ని తట్టింది శ్యామల.

ఆ చేతిని అట్లానే అందుకున్నాను. ఈ చేతిని ఇట్లా అందుకున్నప్పుడు నేను కాక నా చుట్టూ వున్న ప్రపంచమంతటి నుంచీ సజీవమైన చైతన్యమంతా ఈ చేతిలోంచి నాలోకి విద్యుల్లతలా ప్రవహించి నన్ను వెలిగించినట్టుంటుంది.

ఆమె పాదాల్ని చూశాను.

నిండుగా పూచిన అరవిందాలవి.

వాటిపైన మృదువుగా జారిన మువ్వల పట్టీలు.

'ఈ బుజ్జి ముండలకి ఎంత ప్రేమ నేనంటే. నీ కన్నా ముందు ఇవే పలకరిస్తాయి నన్ను.'

ఒదల్లేని, విడువలేని వివశత్వంతో వాలిపోయి ఆ పాదాల్ని ముద్దుపెట్టుకున్నాను. ఆమె చేతుల్ని, జడపాయని, చెంపల్ని, వెనక్కి వంగి ఆమె నడుముని, ఆ నడుము పైన తొంగి చూస్తూ పలకరించే చిన్నారి పుట్టుమచ్చని - అట్లా ముద్దు వెనక ముద్దు.

ఈ మోహ వివశత్వం ఆమెని నిశ్చేష్టితురాల్ని చేస్తుందని నాకు తెలుసు. తనకన్నా, తన మనసుకన్నా, తన అస్తిత్వం కన్నా తన శరీరం ఆకర్షణీయం కావడం ఏ స్త్రీకి ఇష్టం కనుక! నీ అధికాధికమయిన ప్రేమాతిశయమంతా తన శరీరాన్ని తాకి చిట్లిపోతుంటే స్త్రీకి కలిగే వేదన ఎంత పురాతనం! దేహాల విషాదం ఏమిటో దేహాల్ని సృజించే స్త్రీకే కదా తెలిసేది!

- అలా ఆ రోజు నన్ను చూసినప్పుడు, ఆమె కళ్ళల్లో క్షణకాలం మెరిసిన ఆనందం ఆసరాగా చాలాసేపు అలానే కూచుండిపోయాన్నేను. ఇంతలో బయట మబ్బులు కమ్మాయి, మెరుపులు మెరిసాయి, ఉరుములురిమాయి.

వెళ్ళొస్తానని నేను లేచినప్పుడల్లా 'అప్పుడేనా' అన్నదామె.

ముత్యాలు జల్లినట్టుగా చినుకులు పడ్డాయి.

వెళ్ళిపోయుంటే, ఒక వాన కురిసిన రాత్రి, తడిసి మార్దవమయిన ఆ చిన్ని నీడన ఆమె ఎంతో ఆప్యాయంగా పెట్టిన అన్నం తినే అదృష్టం ఎలా ఒనగూడుతుంది! వాన రేకెత్తించిన వింత పరిమళాల మధ్య, ఆమె కలిపిపెట్టిన అన్నం తింటూవుంటే ఆనందపు బెంగతో బలమయిన విస్పత్తున ఆవహించింది నన్ను, జీవించినందుకు ఇంత ఆనందం లభించిందనీ, ఇక రేపట్నుంచి జీవించడం దుస్సాధ్యమనీ.

వచ్చేస్తూండగా అడిగింది "నాకు ఫొనెటిక్స్ అర్థం కావడం లేదు, కొన్నాళ్ళపాటు మీరు ఇంగ్లీష్ చెప్తే బావుంటుంది."

నేను సర్వజ్ఞన్నా? అయినా సరే, ఆ ఆహ్వానం వెయ్యేనుగుల బలాన్నిచ్చింది నాకు. ప్రతి రోజూ పుదయాన్నే లేచి ఆ ఫొనెటిక్స్ గొడవేదో ముందు నేను చదువుకోవడం, ఆ తర్వాత సాయంకాలం ఆమెకి నోట్స్ చెప్పడం, ఏ రోజు చెప్పింది ఆ రోజు మర్చిపోవడం.

"శ్యామూ..." పిలిచాను.

"ఊఁ"

ఆ స్వరంలోని ఏదో మెత్తదనం నన్ను పిచ్చివాణ్ణి చేస్తుంది. నా రెండు చేతుల్నీ ఆమె భుజాల చుట్టూ వేసి ముందుకు లాక్కున్నాను.

"ఇలా అయితే అసలు మనం కలుసుకోవద్దు" విదిలించుకుని పక్కకి జరిగిపోయింది ఆమె. "ఇంతేనా ... ఇందుకేనా" ఇక ఆ పైన ఏమీ మాట్లాడలేకపోయింది ఆమె.

నా ఒళ్ళంతా గాయం.

"ఏదయినా మాట్లాడు, వింటాను"

ఏం మాట్లాడను? మాటల అర్థ రాహిత్యం తెలిసిన నేను. రోజల్లా మాట్లాడటమే నా ఉద్యోగం. ఎన్ని విషయాల మీద ఎంత పరిజ్ఞానంతో ఎంత శక్తిని ఖర్చుపెట్టి మాటాడతానని. కాని ఏం జరుగుతుంది! చివరికి నా మాటలు, నా కంఠస్వరం నాకే విసుగు పుడతాయి. మాటల బోలుతనం లేని, మాటల్తో పనిలేని ఒక నిద్యుత్తేజంలో జీవితమంతా వికసించాలని వుంటుంది నాకు.

ఎంతలేసి విషయాలు చెప్తున్నా క్లాస్‌లో ముడుచుకుని కూచుండే స్టూడెంట్స్ బయట తమలోతాము ఒక చిన్న అర్థంలేని చేష్టకి, ఒక జోక్‌కి. ఎంత లైవ్లీగా ఎందుకట్లా వూగిపోతారో గ్రహించలేను!

మళ్ళీ ఆమె చేతుల్ని అందుకున్నాను.

"ఏమయింది నీ ఉద్యోగం? పెర్మనెంట్ చేస్తామంటున్నారా మీ మానేజ్‌మెంట్?"

విరక్తిగా నవ్వాను నేను. తుమ్మితే వూడిపోయే నా వుద్యోగం గురించి వలిగివలిగి విసిగి పోయాన్నేను. ఆ చీకట్లో నా అంతరంగంలోని విరక్తి ఆమెని తాకినట్టుందేమో. తనే అడిగింది.

"వైజాగ్ వెళ్ళావు కదా, ఎందులోనో ఇంటర్వ్యూకి, అదేమయింది?"

"రావాలి, దాని కోసమే ఎదురు చూస్తున్నాను"

"ఏమిటి ఉద్యోగం?"

"మేనేజిమెంట్ ట్రెయినీ. అభిరుచికి తగ్గది కాదు. కానీ పెర్క్స్ బాగా వుంటాయి. కొన్ని కంఫర్ట్స్‌కయినా నోచుకోవాలి కదా మనం"

"వస్తే, వెళ్ళిపోతావా"

"నిన్ను ఒదిలిపెట్టి వెళ్ళగలనా?" మళ్ళీ ఎక్కడో లోతుల్లో విరక్తి. విశాఖపట్నం ఎంత మెట్రోపాలిటన్ సెంటర్ అయిపోయిందని. ఎన్ని కంఫర్ట్స్ వుంటేమాత్రం, ఆ వేగం, ఆ మహా యంత్రాగారాల్లో, ఆ అయిదారంతస్తుల ఫ్లాట్ల ఇరుకు జీవితపు ఇరుకు విలువలు నిజంగా భరించగలమా? విశాఖపట్నం వెళ్ళడమంటే నిజంగా సముద్రంలోకి దూకడమే. అప్పుడప్పుడు అనిపిస్తుంది, ఆ దారిని కాక, ఈ దారిన ఏ అడవుల్లోకో పోయి ఏ ట్రైబల్ ఏరియాలోనో ఒక చిన్న పాఠశాల నడుపుకుంటే బావుణ్ను అని. ఏ కొండ వాలులోనో అడివి ఒడిలో కొండవాగు ఒడ్డున పాఠశాల. ఎంత బావుంటుంది."

ఇంటి వాళ్ళ పిల్లలు ఆట పరుగులో ఉరుటున వచ్చి పడి ఆమెని వాటేసుకున్నారు "చూడు, ఆంటీ" అంటో.

నవ్వొచ్చింది నాకు. "వాళ్ళ పోటి కూడా వెయ్యనా నేను" అన్నాను.

"వీళ్ళంటే చిన్న పిల్లలు"

"ఏం నేను మాత్రం, నేనూ నీ బుజ్జి పాపాయినే"

"చెప్పడం మర్చిపోయాను" ఆమె పిల్లల్ని మెల్లిగా విడిపించుకుంటూ చెప్పింది "ఎల్లుండి పాప పుట్టిన రోజు. తీసుకు రమ్మని రాసాను నాన్నకి. వస్తావు కదా నాళ."

"ఎందుకు రాను. పాపని చూడాలని వుంది నాకు."

ఇంత దాకా నేను వినడమే ని చూసి వుండని ఆ పాప. నాకేమీ కాకపోయినా, నా మనసంతా సొంతంగా నిండిపోయిన ఆ పాప. తనని కన్నదే తడవుగా తన తల్లిని ఒదలి పెట్టేసిన తన తండ్రిని ఎన్నటికీ చూడలేని పసికూన, పుట్టడమే బ్లైండ్‌గా పుట్టిన దేవతా శిశువు, ఆ బంగారు తల్లి...

## ప్రయాణం

విరునవ్వులన్నీ మూటకట్టుకో
కొన్ని ఇంకా పండలేదు చూసుకో

నీ పాటలన్నీ కూడా పిలుచుకురా
గొంతుల్లో మధువునింపుకురమ్మని

రహస్యాల రెక్కలు తగిలించుకో
కాళ్ళు భుజాన వేసుకురా

కొంచెం తారల్ని జేబులో వేసుకో
మల్లెపూలు మరో జేబులో పెట్టు

ఎవరూ చూడకుండా నా కళ్ళలోకి రా
ఇద్దరం ఒకే కలలోకి ఎగిరిపోదాం



కె. గోదావరిశర్మ

సేకరణ: శ్రీమతి గోదావరిశర్మ

మా మధ్య ఆ క్షణాన్ని మసలినట్టే అనిపించింది.

ఆమె పాప గురించి ప్రస్తావన వచ్చినపుడల్లా నా ఆత్మలోనే ఏదో ఎలర్ట్‌నెస్ కలుగుతుంది.

ఇంకా ఇరవై యేళ్ళు కూడా దాటని ఈ యువతి తన జీవితంలో అనుభవించవలసిన నరకమంతా అనుభవించిందనీ, పెళ్ళి, పిల్లలు, దాంపత్య జీవితం, జీవితం పొడుగునా తన చేతిలో చెయ్యి వేసి నడవవలసిన భర్త తనని నిష్కారణంగా విడిచి పెట్టెయ్యడం, అన్ని అనుభవాలూ ముగిసిపోయి తన యవ్వనారంభ దినాల్లోనే ఆమె మరొక కొత్త జీవితం కోసం ప్రయత్నించవలసి వస్తోందనీ అనుకోవడమే కష్టంగా వుంటుంది.

సాధారణంగా తన వయసు యువతులు అర్హతల్నీ, యోగ్యతల్నీ ఒక్కొక్కటీ సమకూర్చుకుంటూ, మధురమయిన వూహల్తో, కలల్తో తమ జీవిత భాగస్వామికై ఎదురు చూస్తో గడిపే రోజుల్లోనే, కలసి జీవించవలసిన జీవితం విఫలమై, కన్నవాళ్ళకి బరువు కాలేక తన జీవితం తను జీవించడం కోసం ఒంటరి ప్రయాణం సాగించాల్సి రావడం.

జీవితంలో ఇంకా ఏ అనుభవానికీ నోచక,
సుందర భవిష్య తీరాలని

వెతుకులాడుకుంటో, గాఢమయిన
ఏ విషాదం వల్లగాని, ఏ ఆనందం వల్లగాని
జీవితం కలత చెందని విశ్రాంతిలో ఇటుపక్క నేను.
శ్యామలని నేను ప్రేమిస్తున్నాను, ఆరాధిస్తున్నాను, నిజంగా
ఇద్దరు స్త్రీ పురుషులు కలిసి జీవించడంలో ఏ
మాధుర్యం వుందో అది మా మధ్య వుందని

చెప్పగలను. కాని ఇద్దరు స్త్రీ పురుషుల సహజీవనంలోని అంతిమ శారీరక పర్యవసానం-అది మాత్రం తప్ప.

ఆ వరకాన్ని ప్రత్యక్షంగా అనుభవించి, ఒక పాపని వెంట పెట్టుకుని మరీ బయటపడ్డ అనుభవం శ్యామలది.

ఆ స్వర్గం ఎలా వుంటుందోనన్న అన్వేషణ నాది.

కాని ఆ వూహ వెంటనే, జయించలేని భయాలు వెన్నాడుతాయి నన్ను. శ్యామలని తాకగానే ఒక క్రూరత్వాన్ని సంతరించుకుంటాయి నా వేళ్ళు. హింసపైని ఆధారపడ్డ ఆనందమేనా ఇది. ఆమెను బాధించలేని అపురూపమైన దయాతత్వమేదో నన్ను ఆ చీకట్ల నుంచి దీపంలాగా వెలిగి పక్కకి తప్పిస్తుంది. పొగలు చిమ్మి, బుసలు కొట్టే ఇన్‌ఫెర్నల్ దారుల్నుంచి ఏ ఉదార అంతస్సత్వమో హితంగా వెనక్కి లాగుతుంది నన్ను.

ఇలాగే ఇద్దరు స్నేహితుల్లాగా సాయంకాలాన్నీ, మా జీవితాల్లోని శూన్యాన్నీ, వ్యధనీ, వాటిని దాటి ఉప్పొంగే అనిర్వచనీయ ప్రశాంతినీ పంచుకోలేమా అనుకుంటాను. గోడ మీది ఆ బొమ్మలోని చిన్న పిల్లల్లాగా శరీరాలు ఏకంకాని దాంపత్యాన్ని సాగించలేమా అనుకుంటాను.

"అన్నం తిందువుగాని."

ఆ చిన్న గది, ఆ అద్దె ఇంట్లో మాసిపోయిన ఆ గోడల ఆ పాతగది, అది మా ఇల్లు. ఆ యువతి, నాకేమీ కాని ఆమె, నా జీవిత సహచరిణి. ఆ జీవితం ఆ మా దాంపత్యం. ఆ సన్నజాజి తీగె, ఆ ఆకాశం, ఆ నక్షత్రాలు అన్నీ మాకోసమే సృజించబడ్డాయి. ఆ ఒక్క నిషిద్ధ ఫలం మినహా ఈ నందనోద్యానమంతా మాదే.

"ఇవాళ రాత్రి వి.ఎస్. వస్తున్నారు. స్టేషన్‌కి వెళ్ళాలి. టైం లేదు. బయల్దేరతాను" అన్నాను.

ప్రశ్నార్థకంగా చూసింది ఆమె.

"చెప్పలేదు కదా. ఆయన గొప్ప రసజ్ఞుడు. సంగీత సాహిత్యాల్లో రసలోకం అంచులు చూసినవాడు. కాని బయటి ప్రపంచానికి పెద్దగా తెలీదు ఆయన గురించి. ఆయన కూడా చిన్న చిన్న గోష్ఠుల్లో, మిత్రుల మధ్యా అయితేనే మూవ్ కాగలుగుతాడు. రేపు ఇక్కడ మ్యూజిక్ కాలేజీలో సెమినార్ వుందట, హైదరాబాద్ నుంచి వస్తున్నాడు ఆయన."

సరాసరి స్టేషన్‌కే వెళ్ళాను. ట్రెయిన్ గంట లేటు. వెయిట్ చేస్తూ కూచున్నాను. ఆ గంట ఆలస్యం మరో గంటకి పెరిగింది. కాని వి.ఎస్. కోసం ఎంత కాలమయినా వెయిట్ చెయ్యగలం. ఏ ఒకటి రెండు ట్రయిన్లకో తప్ప రద్దీ వుండని ఆ ఈస్ట్రన్ రైల్వే స్టేషన్‌లో ఒక దూర శూన్యం నుంచి దూసుకు వచ్చి ఇటొక దూర శూన్యంలోకి సాగిపోయే రైలు పట్టాలు. వెలిగి ఆరే ఎర్ర దీపాలు, పచ్చ దీపాలు.

ఆ అర్ధరాత్రి నిద్ర పోతూన్నట్టుగా వచ్చిన ట్రెయిన్‌లోంచి ప్రకాశభరితమయిన నేత్రాల్తో దిగారు వి.ఎస్. ఆ కళ్ళు నాకోసమే వెతుకుతూ, నేను కనిపించగానే వాత్సల్యంగా మెరిసాయి. నిద్ర మానుకోలేని లోకం కోసం, నిద్ర మానుకుని మేలుకునే వాడిలా వుంటాడు ఆయన. తన మొద్దు నిద్రలో పడి ఈ లోకం ఏ అపురూపమయిన అమృత వర్షాన్ని మిస్ అవుతుందోనని ఆయనకా మెలకువ.

దుర్బలంగా వుండే ఆ దేహం వెనుక జీవితానందపు పట్టుత్వం. బాగా వెలిసిపోయిన పాత ఫాషన్ బెల్‌బాటమ్ పాంటు మీద ఒదులు ఒదులుగా తొడిగిన జెర్కిన్. కళ్ళపైనా పక్కగానూ మెరిసే ముదురూ, చెంపలూ, చురుగ్గా పడే అడుగులు.


ఆయన చేతిలోని చిన్న బ్రీఫ్‌కేస్ అందుకుంటూ అడిగేను.

"మీ కోసం గెస్ట్‌హవుస్ ఏదయినా వుంటుందేమో. కానీ మీరు నా ఇంటికి వచ్చేస్తేనే బావుంటుంది."

"అంతకన్నానా" ఆయన రైల్వే స్టేషన్‌ని నాలుగు కళ్ళతోనూ కలయ చూస్తూ "నా జీవితమంతా గెస్ట్ హవుస్‌ల్లోనూ, హోటళ్ళలోనే గడిచిపోయింది. ఆ స్పాంజ్ మేట్రస్‌లూ, ఆ మాసిన మస్కిటో నెట్‌లూ, ఆ స్టింకింగ్ స్మెల్- దుర్భరం. ఇంటికే వెళ్ళిపోదాం పద" అన్నారు.

రిక్షా పిలిచి ఎక్కబోతుండగా ఆయన ఇంకా స్టేషన్ ఎదటనే వుండిపోయి విభ్రాంతిగా నిలబడిపోయారు. ఆ క్షణాన ఆయన ఏ ఆకాశం మూలనించి ఏ పిలుపుని విన్నారో! ఇంతలో తేరుకుని వడివడిగా నడిచి వస్తూ "విజయనగరానికి కదూ వచ్చాను నేను, ఇది విజయనగరం...విజయనగరం" అని గొణుక్కుంటూ "పద పద" అన్నారు.

నిర్మానుష్యమయిన వీధుల్లోంచి బరువుగా రిక్షా సాగుతోంది. ఆయన్ని తీసుకుని ఆ రిక్షాలో నా ఇంటికి వెళ్తోంటే నాకేదో చిత్రమయిన అనుభూతి కలిగింది. ఈ అర్ధరాత్రి ఎంత అపురూపమయిన అతిథీ, సన్మిత్రుడు తన మధ్యకి





వచ్చాడో విజయనగరానికి తెలుసునా? ఎంత బండ నిద్ర దీనిది! విశాఖపట్నం మీద బాంబులు పడ్డా విజయనగరానికి మెలకువ రాదని ఎవరో సరదాకి అన్నా ఎంత నిజం మాటాడారు!

2

సంగీతోత్సవంలో విరాజిల్లుతున్న మహారాజా మ్యూజిక్ కాలేజి ఆవరణలో కూచుని వున్నాం. ఆడిటోరియంలో గాత్రకచేరి. ఇప్పుడిప్పుడే సంగీత ప్రపంచంలోకి కళ్ళు విప్పుకుంటున్న ఒక యువ గాయకుడు త్యాగరాజకృతులు ఆలాపిస్తున్నాడు. ఆడిటోరియంలో, వరండాలో కిక్కిరిసిన శ్రోతలు. ఆవరణ పొడుగునా దీపాల తోరణాలు. నిలబడీ, కూచునీ, గుంపులు గుంపులుగా చేరీ- మరింతమంది శ్రోతలు.

ఆవరణలో ఒక మూలకి చెట్టునీడన తిన్నె మీద కూచున్నారు వి.ఎస్. ఆయన చుట్టూ వూళ్ళోకెల్లా పేరొందిన కళాకారులూ, రచయితలూ, గాసిప్ మాంగరర్స్. వారి మధ్య తనదయిన ఏకాంతంలోకి పోయి సిగరెట్ పైన సిగరెట్ కాలుస్తో నిశ్శబ్దంగా కనులు అరమూసి సంగీతం వింటున్నాడు ఆయన. ఆడిటోరియంలోంచి అలలలలుగా లేచివస్తోన్న గానపు చిన్ని తరగలు ఆయన్ని చేరి మారాం చేస్తున్నట్టుగా, పల్చని సాయంకాలపు గాలిలో ఆయన జుత్తు వూగుతోంది.



ఆయన మట్టూ ఆయనకు వినబడాలనీ, ఆయన్ని ప్రావోక్ చెయ్యాలనీ చర్చలు, వ్యాఖ్యలు. కాని గంభీ రమయిన ఆయన మౌనంలో అవి అణగిపోయి నిశ్శబ్దం ఎక్కువవుతోంది.

ఇంతలో ఎక్కణ్నుంచి వచ్చాడో ఒకాయన, ఆ గాయకుడి దగ్గర బంధువో దూరపు బంధువో అతని శ్రేయోభిలాషి ముక్క తెగిపడ్డట్టుగా వూడిపడి, ఒక గాడ్రెజ్ ఛెయిర్‌ని బర్రునలాగి, కర్చీఫ్‌తో దాన్ని నాలుగయిదుసార్లు బాది, బరువుగా కూలబడుతూ "అయ్యా మీరు చెప్పండి. ఈ కుర్రాడికి భవిష్యత్తు వుందా లేదా" అనడిగాడు; "ఈ రాత్రికి లోకం వుంటుందా, ప్రళయం వచ్చేస్తుందా" అన్నంత ఆతృతగా.

వి.ఎస్. ఆయన్ని చూడను కూడా చూడకుండా కుర్చీలో కొద్దిగా అసహనంగా కదిలి, నా వైపు చూసి "రాజా, ఇక్కణ్నుంచి చూడు ఆడి[illegible]క సంగీతదీపనౌక మృదువుగా కదుల్తున్నట్టు లేదూ ఇదిగో, మ[illegible], ముందు ఈ ఒంగిన చెట్ల మానుల మీంచి చూడు. ఆ విశాలమయిన హాలు ప్రాకారాలూ, ఆ గవాక్షాలూ ఆర్చీలూ, అటు నాలుగు, ఇటు నాలుగు మొత్తం ఎనిమిది ద్వారాలూ... ఒక్క క్షణం నిన్ను నువ్వు మర్చిపో. ఒక అద్భుతమయిన పడవ ప్రయాణంలా లేదూ. ఇందాకటి నుంచీ నేను ఈ ప్రయోగమే చేస్తున్నాను"

మట్టూ వున్నవాళ్ళు తెల్లబోయి చూస్తున్నారు ఆయన్ని.

"ఒట్టి నావ మటుకే కాదు. ఆ కిటికీలకు రెక్కలొస్తాయి చూడు. ఆ ద్వారాల మధ్య నుంచి ఒన్‌థౌజండ్ ఓర్స్ కదుల్తున్నాయి. లోపల్నుంచి వినిపించే ఆ గానం నిన్ను నెమ్మదిగా తన రెక్కల మీదుగా తీసుకుపోవటంలేదూ. ఈ చిన్న ఆవరణలో అనేక ఊర్ధ్వ లోకాలు పట్టేటంత వైశాల్యం వుంది, గమనించావా."

అలా అంటూనే ఆయన లేచి బయటకి అడుగువేశాడు. నాకు ఇదంతా అర్థమయేలోగానే మేం కోట ఎదట వున్నాం. లోపల గాయకుడు కృతి ముగించినట్లుంది. తెరటంలాగా చప్పట్లు. బయట దృఢమయిన ఆ పురాతన మయిన కోటగోడ మీదా, కందకం మీదా అప్పుడే ఉదయించిన వెన్నెల పడి మెరుస్తోంది.

"ఒక స్వప్నం లాంటి తమకమేదో నన్ను ఆవహిస్తుంటే వచ్చి డిస్టర్బ్ చేశాడు. ఆ క్రూయెల్టీని భరించలేకపోయాను..." సంజాయిషీగా తనలో తాను అను కుంటూనే, నాలుగురోడ్ల కూడలిలో నిలబడిపోయాడు ఆయన. ఈసారి ఆయన్ని షాక్ చేసింది మనిషి కాదు, విగ్రహం! "ఇదిగో, ఈ విగ్రహం చూడు. ఇది గురజాడ అప్పారావు గారిదిట. ఇది విగ్రహం కాదు. మైగాడ్, క్రూయెల్ కారికేచర్" భరించలేక కళ్ళు మూసుకున్నాడు ఆయన. "ఈ వూళ్ళో నన్ను [illegible]ంటూ వుంటే అక్కడికి తీసుకువెళ్ళు రాజా" పేలగా ఆయన [illegible] క్రూయెల్టీ లేని మనుషులూ, క్రూయెల్టీ లేని విగ్రహాలూ, క్రూయెల్టీ లేని చోటూ ఎక్కడన్నా వున్నాయా"

"మీరు రాగలిగితే ఒక చోటికి తీసుకువెళ్తాను" నెమ్మదిగా అన్నాను.

ప్రశ్నార్థకంగా చూసారు ఆయన.

"శూన్యంగా వుండే నా జీవితంలో నాకు కన్పించిన ఒకే ఒక్క అర్థవంతమయిన చోటు. నాకున్న ఒకే ఒక్క ఫ్రెండ్ ఇల్లు."

మేం వెళ్ళేటప్పటికి ఎక్కడికో వెళ్ళబోతోంది శ్యామల.

మమ్మల్ని చూసి ఆగిపోయింది.

వి.ఎస్.ని పరిచయం చేశాను. చాలా ఎరాటిక్‌గా వుండే ఆ వ్యక్తిత్వంలో ఏ

కొద్దిమందికోగాని చూసిన వెంటనే గుర్తుపట్టడం సాధ్యంగాని ఏ మహనీయతని చూపిందోగాని ఆమె రెండు చేతులూ జోడించి నమస్కరించింది. నిలువెల్లా కదిలిపోయారు వి.ఎస్.


"మేం వచ్చి మీ ప్రోగ్రాం డిస్టర్బ్ చేసినట్టున్నాం. ఎక్కడికో వెళ్తున్నారల్లే వుంది." ఒట్టి మర్యాద మాత్రమే కాదు ఆ వాక్యాల్లో వున్నది. ఔదార్యవంత మయిన ఆ సంస్కారం విన్నవాళ్ళకే బోధపడుతుంది.

"అబ్బే, ఏమంత ముఖ్యం కాదు" శ్యామల టీ ఏర్పాట్లు చేస్తూ "మీరు వస్తున్నారని రాజా చెప్పాడు. ఇంటికి తీసుకురమ్మని అడుగుదామనుకున్నాము. కానీ..."

టీ అందించింది ఆమె.

ఆప్యాయంగా టీ కప్ అందుకుంటూ చుట్టూ కలయచూసారు. "ఆ పుస్తకాలేమిటి?" అలమారు దగ్గరకి లేచి వెళ్ళి పుస్తకాలు ఒక్కొక్కటే చూసారు. అందులో 'ఫొనెటికల్ గ్రామర్'- నేను కొనిచ్చిన పుస్తకం కూడా.

"రాజా నాకు చెప్పనే లేదు. చెప్పి వుంటే నిన్న రాత్రి సరాసరి ఇక్కడికే వచ్చి వుండేవాణ్ణి."




నిలువునా చలించిపోయాం ఇద్దరం ఆయన మాటలు విని. ఎంతో సత్యం, శాంతి వుంటేనేగాని ఏ మనుషులూ, ఏ ఇల్లూ వి.ఎస్‌ని ఆనందపర్చలేవని నాకు తెలుసు.

ఆయన ఆమె ఇన్‌స్టిట్యూట్ గురించీ, చదువు గురించీ, పరీక్షల గురించీ వివరంగా అడిగారు. టీచింగ్ ప్రొఫెషన్ ఎంతో గొప్పదనీ, టీచర్ కాగలగడం ఎంతో అదృష్టమనీ అన్నారు.

కొద్దిసేపు మాట్లాడిన తరువాత, మేం బయల్దేరడానికి లేవబోతూంటే "ఈ పూట ఇక్కడే భోంచేసి వెళ్ళండి" అందామె.

అప్పుడు వి.ఎస్‌ని చూద్దునుకదా, ఆయన కళ్ళల్లో నిండుగా నీళ్ళు. అతి కష్టం మీద తనని తాను సంబాళించుకుంటున్నాడు ఆయన. ఆ క్షణాన ఆయన ఎప్పుడో అన్న మాటలు గుర్తొచ్చాయి నాకు.

"అడక్కుండా అమ్మైనా పెట్టదు అంటారు. అది నిజం కాదు. అడక్కుండా అన్నం పెట్టేది ఒక్క అమ్మ మటుకే. నీకు తెలీకుండానే నీ ఆకలిని తెలుసుకునేది అమ్మ మటుకే. నన్నే చూడు. అమ్మ లేకపోయిన తరువాత నాకు అన్నం తోటే అవసరం పోయింది."

ఇక వి.ఎస్‌ని నిగ్రహించడం కష్టం.

"లేదు శ్యామూ, అక్కడ ఆయన కోసం అంతా ఎదురు చూస్తుంటారు. వెళ్ళకపోతే డిజప్పాయింట్ అవుతారు. వెళ్ళాలి."

లేచాం. ఆమె కూడా లేచి తలుపు దాకా వచ్చి "మీ ఇష్టం. కానీ రేపు పాప పుట్టినరోజు కదా. ఆయన్ని తీసుకురా" అని, మళ్ళీ చేతులు జోడించి ఆయనకు నమస్కారం చేసి "రేపు మా పాప వస్తుంది. దాని పుట్టినరోజు. చిన్న డిన్నర్ ఎరేంజ్ చేస్తున్నాం. మీరు తప్పకుండా రావాలి" అంది.

నేను ఏదో చెప్పబోతూండగా వి.ఎస్ నన్ను వారించి "రాగలిగే అదృష్టం వుంటే తప్పకుండా వస్తాను" అని ఆమెకి రెండు చేతులా నమస్కారం చేసారు.

రోడ్డు మీదకి వచ్చి రిక్షా పిలిచాను. "మ్యూజిక్ కాలేజి దాకా" అని చెప్పబోతూంటే, ఆయన రిక్షావాడితో "ఈ ఊళ్ళోకెల్లా నీకు వచ్చిన పెద్ద బార్ ఎండ్ రెస్టారెంట్ ఎక్కడ వుంటే అక్కడికి తీసుకువెళ్ళు" అన్నారు.

సుదూరపు అంచులదాకా నల్లని రైలుపట్టాల పైన వెన్నెల.

బార్‌లో కొద్దిసేపు గడిచిన తరువాత, ఆ డిమ్‌లైట్ల కాంతీ, గ్లాసుల చప్పుడూ, మంద్రంగా వినవచ్చే వెస్ట్రన్ మ్యూజిక్, అక్కడ మాత్రమే వుండే ఒక ఇన్‌ఫెర్నల్ మూడ్ బాగా పట్టిన తర్వాత—

"ఇందాకా వాడు ఏమిటి అడిగాడు. ఆ కుర్రాడికి భవిష్యత్తు వుందనా?" ఆ కళ్ళల్లో దెబ్బతిన్న మృగం కళ్ళలోని బీస్టియల్ డివినిటీ,మూగ దీనత్వం. "నేను జాతకాలు చెప్పేవాడిలా కనిపిస్తున్నానా వాడికి!"

కొన్ని క్షణాల తర్వాత

"నన్ను ఇవాళ నువ్వు ఒక దేవతామూర్తి దగ్గరకు తీసుకువెళ్ళావు. హెల్ టు దిస్ వరల్డ్. ఎంత పవిత్రమయిన చోటికి వెళ్ళి వచ్చా మనం" ఆయన నా గడ్డాన్ని తడిమారు. ఆప్యాయంగా నా తల మీద చెయ్యివేసారు. "పాప పుణ్యాల లోకంలో నిప్పుల మధ్య నడచినట్టు నడచిన నన్ను, బాబూ, చిన్న పిల్లలు కట్టుకున్న పాపపుణ్యాతీతమైన ఇంటికి ఆహ్వానించేరు మీరు... నీ బాధ నాకు తెలుసు. నువ్వు నాకు చెప్పగలిగినంతా చెప్పావు. చెప్పుకోలేని నీ సఫరింగ్ కూడా నాకు తెలుసు. ఏమంటే అది నేను మటుకే అర్థం చేసుకోగలను..."

"కొన్నేళ్ళ కిందట, ఒకనాడు నాకూ ఇలాంటి సమస్యే వచ్చింది. అప్పటికే నేను సంగీత ప్రపంచంలో పెద్ద పేరు తెచ్చుకున్నాను. చాలా మంది సంగీతం నేర్చుకోవడానికి వస్తామనేవారు. కాని ఆ పనే పెట్టుకోలేదు నేను. మిత్రులు కొంతమంది ఏకంగా ఒక మ్యూజిక్ కాలేజి పెట్టి ప్రిన్సిపాల్‌ని చేస్తామన్నారు నన్ను. రిడిక్యులస్. ఒద్దు పొమ్మన్నాను. నచ్చినపుడు ఎక్కడో ఒకచోట గొంతెత్తి పాడడం, అది ఎక్కడయినా గానీ, హోటల్ గానీ, పార్క్ గానీ, ఏర్‌పోర్ట్ గానీ, నచ్చకపోతే, ఎంతో ముఖ్యమైన ఆడిటోరియంలో కూడా గొంతు పెగిలేది కాదు. ఒక ఆర్టిస్ట్ స్వభావమే అలా వుంటుంది. దాన్ని అతిక్రమించడం నాకు సాధ్యం కాలేదు."

కొన్ని క్షణాల మౌనం, మద్యం. ఆ తర్వాత మళ్ళీ-

"అలాంటి రోజుల్లో ఒకసారి ఒక మిత్రుడి ఇంటికి పెళ్ళికి వెళ్ళాను. ఆ పెళ్ళి అయిన మర్నాడు మధ్యాహ్నం పందిట్లో కూచుని మాటాడుకుంటున్నాం. లోపల ఏదో పేరంటం అవుతున్నట్టుంది. ఆ హడావిడి ముగిసిందో, మధ్యలోనో గాని ఒక పాట సన్నగా వినిపించడం మొదలు పెట్టింది. స్త్రీల శ్రావణ మంగళవారం పాటలుంటాయి చూడు, అట్లాంటి పాట. నువ్వు నమ్ము. ఆ పాట పాడుతున్నది ఎవరో నాకు తెలియదు. కానీ కొద్ది సేపట్లోనే నన్ను నేను మర్చిపోయాను. నాకు కళ్ళమ్మట ధారాపాతంగా కన్నీళ్ళు. ఏ దివ్యత్వంలోకి తమ ఆలాపన ప్రవహించిన తమ జీవితాన్ని ధన్యం చేయాలని మహా గాయకులందరూ జీవితమంతా తపిస్తారో ఆ దివ్యత్వమేదో అత్యంత సహజంగా, అప్రయత్నంగా ఆ స్త్రీ కంఠంలో అపారంగా పొంగి పొరలుతున్నట్టు అనిపించింది. పాట అయ్యేటప్పటికి నేను ఈ

# (స)ముద్ర హృదయం

సముద్రం తాపీగా ఉన్నదెపుడు?
హృదయం సావధానంగా ఉన్నదెపుడు?
ఎప్పుడూ ఏదో ఒకటి
నిరంతరం తన్నుకు చస్తూ .
తల్లబద్దలు గొట్టుకుంటుంది
సముద్రం విశ్రాంతిని మరిచిపోయి
ఒడ్డుకేసి కెరటాలను అదేపనిగా బాదినట్లు!
హృదయమూ ... ... అంతే
ఒట్టి రాలుగాయి ...
ఏవో గాయాలను గేయాలను
కెలుకుతూ బాధపెడుతూనే వుంటుంది
సముద్రం స్తబ్దంగా ఉన్నదెపుడు?
హృదయం ఖాళీగా ఉన్నదెపుడు?
ఏ రాయి వేసినా తట్టుకోని సముద్రం
అలలు అలలుగా సవాలు చేసి విసిరి కొడుతుంది



ఏ చిన్న బాధ దొర్లినా
నొచ్చుకున్న హృదయం
ఉంగలు ఉంగలుగా చుట్టుకుని బావురుమంటుంది
సముద్రం అలలను మర్చిపోయింది ఎప్పుడు?
హృదయం కలలను వదిలింది ఎప్పుడు?
నిశ్చలంగా వుండే లోతైన నదులను
చూసి కుళ్ళుకునే సముద్రం
అజ్ఞానిగా బ్రతకటంలో వున్న సుఖాన్ని చూసి
ఈర్ష్యపడే కవి హృదయంలా వుంటుంది
హృదయం సముద్రంలోనికి పరుచుకోవాలనుకుంటే
సముద్ర హృదయానికి చేరువవ్వాలని అనుకుంటుంది.
సముద్రం హృదయం
హృదయమే సముద్రం
అసలు సముద్రం తీరికగా వున్న ఘడియలెన్ని?
అసలు హృదయం శూన్యంగా వున్న క్షణాలెన్ని?

— 'నిలి'

లోకంలో లేను. గొప్ప గాయకులన్న వాళ్ళ సంగీతమంతా విన్నాను నేను. కాని ఎన్నడూ అట్లాంటి పారవశ్యం ఎరగను''

''మాష్టారూ, ఆ పాట పాడినామె నా భార్య. మీ దగ్గర సంగీతం నేర్చుకోవాలని వుందిట ఆమెకు'' ఆమె భర్త ఎంతో ప్రార్థనగా అడిగేడు. ఆయన ఆ వూళ్ళోకెల్లా పెద్దమనిషి.

ఆయన అడిగిందేమిటో అర్థమయ్యేసరికి అవాక్కయ్యాన్నేను. ఆమెకి నేను సంగీతం నేర్పడమా, లోకానికి ఎంత నేరో మెజర్‌మెంట్స్.. కాని ఆమె స్వరాన్ని రోజూ వినగలగడం, అంత మహాదృష్టం అంత అప్రయత్నంగా పడుతుందని వూహించలేకపోయాన్నేను!'

''నేను ఎవరో ఒకరికి సంగీతం నేర్పడానికి అంగీకరించానన్న సంగతి, పెద్ద వార్త అయిపోయింది. కాని, నమ్మలేని ఈ వార్త వెనక ఎవరూ నమ్మలేని నిజం, నేనే ఆమె నుంచి స్వర రహస్యాన్ని తెలుసుకుంటున్నానని ఎవరికి బోధపడుతుంది?''

''ప్రతి ఉదయం, సాయంత్రం ఆ దినాలంత ఉజ్వలమయిన కాలంతో నా జీవితంలో మరెన్నడూ లేదు. అప్పుడు గమనించాను నేను. ఆమె గాన రహస్యం ఆమె స్వరంలో లేదు. విశిష్టమయిన ఆమె సంస్కారంలో, హృదయంలో, జీవితంలో – మేలయిన పువ్వు నుంచి వచ్చే మేలయిన పరిమళం లాగా, ఆమె అస్తిత్వం నుంచి అంచులు పొంగి ప్రవహించే ఆనందం ఆ సంగీతం.''

నేను ఆశ్చర్యంగా వింటున్నాను. ఎన్నో నోళ్ళ ద్వారా ఎంతో స్టాండర్డైజ్డ్‌గా విన్న ఈ కథ, నేను ఇంతకాలం ఎన్నడూ సాహసించి అడగలేకపోయిన ఈ రహస్యం, ఇవాళ వింటున్నందుకు.

''గొప్ప ఆనందాన్ని పొందినప్పుడు మనుషుల జీవితాలు వూహించలేనట్టుగా మారిపోతాయి. అందుకే అలాటి జీవితాలు ఫెయిరీ టేల్స్ అవుతాయి. నాదీ ఒక ఏండర్సన్ ఫెయిరీ టేల్ అనుకో. ఏమంటే ఆ ఆనందం ఎక్కువ రోజులు నిలవలేదు. ఒక రోజున, ఆ నా మిత్రుడు, ఆ రోజు అంత వినయంగా అర్థించినవాడే, 'ఇక రేపట్నుంచి ఆమెకు మీ పాఠాలు అవసరం లేదు మాష్టారూ' అని చెప్పాడు. షాక్ అయిపోయాన్నేను. ఎంత ఒత్తిడి చేసినా ఆమె గాని, అతను గాని ఏమీ మాటాడలేదు.' కానీ నాకు తెలిసింది. నేను తాగుతానని అతనికెవరో చెప్పారుట. ఒక తాగుబోతు దగ్గిర తన భార్య సంగీతం నేర్చుకోవడం అతనికి ఇష్టం లేదుట.''

ఎంత నిర్లిప్తంగా చెప్పాలనుకున్నా ఆ చివరి మాటలు చెప్తుండేసరికి ఆయన కంఠంలో క్రోధం, కసి, దుఃఖం ఖంగుమంటూ మోగాయి.

''మరి ఆమె ఏమంది?''

''ఏమంటుంది? తన భర్త మాటకే తల ఒగ్గింది. ఆ చివరిసారిగా కలుసుకున్న రోజు నాకు బాగా గుర్తు. 'మీరు ఆర్టిస్ట్. ఆర్టిస్ట్ పసి పిల్లవాడి లాగా తన దృష్టి లోంచే లోకాన్ని చూస్తాడు. మారాం పడతాడు. మీరు నా దృష్టిలోంచి కూడా ఎందుకు చూడరు? మనం దూరంగా వుంటే అందరికీ మంచిది'' అంది. 'నా వల్ల ఏమిటి తప్పు! ఎందుకు నాకీ శిక్ష?' ఎంతగా మారాం చేసానో చెప్పలేను. కానీ 'దయచేసి మనం కలుసుకోవద్దు, విడిపోదాం' అదే మాట.''

''మీరు కలవకుండా వుండిపోగలిగేరా''

ఆయన ఒక ఐస్ క్యూబ్‌ని తీసి చేత్తో పట్టుకోబోయేరు. కానీ కాల్చే ఆ చల్లదనాన్ని చేతుల్లో నిలుపుకోలేక కింద పడేశారు.

''కలవకుండా వుండిపోవడం నిజంగా నాకు సాధ్యం కాలేదు, ఇవాల్టికి కూడా. కాని తాగ కుండా వుండగలగడం కూడా సాధ్యం కాదు. ఎప్పటికీ'' మళ్ళీ పెగ్ చేతుల్లోకి తీసుకుని గొణుక్కున్నారు. ''ఎందుకు తాగుతున్నాను నేను? అవును, ఎందుకు?'' ''ఎందుకంటే'' ఆయన పళ్ళు బిగపట్టి, కటువుగా, బిగ్గరగా ''తాగకపోతే, నేను మనిషిగా వుండలేను కనుక'' అని గట్టిగా అరిచారు.

బార్‌లో అన్ని ముఖాలూ మా వైపు తిరిగాయి.

"బాబూ, నువ్వు చిన్నవాడివి. లోకం గురించి నీకు తెలీదు. ఈ లోకంలో ఎవరూ జీవించి లేరు. ఇది మరణించిన వాళ్ళ లోకం. పవర్, డబ్బు, వ్యాపకాలు వెంపర్లాట కోరలకి చిక్కి మరణించని వాడు ఎవడన్నా వున్నాడా? జీవితం అంచులు చూసినవాడు, రహస్య గర్భాలయంలోకి ప్రవేశించి బతికి వున్నవాడు, తనని తాను నిర్భయంగా చూసుకోగలవాడు సత్యవంతుడు ఎవడయినా వున్నాడా?"

"నేను సత్యవంతుణ్ణి- కానీ తాగితేనే గాని నాకా శక్తి రాదు. నన్ను నేను నిలువునా దహించుకోందే!" "నీలోని బేస్‌నెస్ పూర్తిగా ఎండిపోవడమే నిజమయిన నిర్వాణమని ఎవరయ్యా అన్నది! ఒక మనిషిని ప్రేమించి, ద్వేష రహితంగా, హింసా రహితంగా ఆ మనిషితో కలసి జీవించడమనేది ఈ లోకంలో సాధ్యపడుతుందా చెప్పు?"

"నేను ఎందుకు తాగుతానంటే ఎవరినీ హింసించలేను కనుక తాగుతాను. నేను తాగకపోతే, మా ఇద్దరి మధ్యా ఆ స్నేహం అలానే కొనసాగి వుంటే ఏమయివుండేది?"

మత్తుగా నిశ్శబ్దంగా కొంతసేపు. ఆ తర్వాత-

"ఇది విజయనగరం కదూ. ఈ ఊళ్ళో బాగా చదువుకున్నవాడు, అందగాడు, భావుకుడు, నాగరీకుడు అయిన ఒక యువకుడి ఒక సాయంకాలం జీవితం ఎలా వుంటుంది? అటువంటి యువకుడితో తన కన్యాశుల్కం కథ మొదలు పెట్టాడు అప్పారావు గారు. ఆ యువకుడు తాగుబోతుకాదు. కానీ ఎంత ట్రెచరస్‌గా, వైల్‌గా, ఆపర్చునిస్టిక్‌గా అతని కథ అడ్డం తిరిగింది! నువ్వూ, నేనూ అందరం గిరీశాలమే. కానీ, కానీ..." ఆయన గొంతు బొంగురు పోయింది. "మనం గిరీశాలం కాకూడదు. కాలేం, అందుకే తాగుతున్నాను"

మద్యం ఆయన్ని నెమ్మదిగా ఆవహిస్తోంది. కాని ఎంత పాటి డ్రింక్ అయినా ఆయన నిబ్బరాన్ని దెబ్బతీయడం కష్టం.

"చిన్నతనం నుంచి చూస్తున్నాను" ఆయన మాటల్లో ఔదార్యం, కరుణ వర్షంలాగా కురుస్తున్నాయి. "ఈ లోకంలో హింస"

"మన అన్ని హింసలకీ విక్టిమ్స్ స్త్రీలు. మన పిల్లల్ని చూస్తే మనకి బోధపడుతుంది. ఆడవాళ్ళని హింసించడమంటే- ఈ మాటకి అర్థం నీకు తెలీదు.

కాని నువ్వూ తెలుసుకునే ప్రయత్నంలోనే వున్నావు. ప్రేమ, పెళ్ళి, దాంపత్యం, పిల్లల్ని కనడం- ఈ మాటలు లోకంలో సర్వ సాధారణాలు. కాని ఎవరేనా సాధు పురుషుడు నిజంగా చూస్తే ఎంత భయంకరమైన మాటలివి! అయినా లోకం నడుస్తూనే వుంటుంది. ఆగదు"

ఆయన మాటలు తడబడుతున్నాయి.

"ఇందాకా ఆ కుర్రాడి భవిష్యత్తు గురించి కదూ అడిగాడు ఆ ప్రబుద్ధుడు. ఆ కుర్రవాడిది గొప్ప సాధన. సందేహం లేదు. కాని అతని కంఠంలో రెండు కంఠాలు విన్పిస్తున్నాయి. ఒకటి అతనికి పుట్టుకతో వచ్చింది. సహజమయింది. నిరలంకారమయింది. తనని కన్నతల్లి పురిటి వాసనని, జన్మల సౌహృదాన్ని మోసుకు వస్తున్న స్వరం. అచ్చంగా తనదే అయిన ఒరిజినల్ టోన్. రెండో కంఠం, తన చుట్టూ వున్న వాళ్ళ కోసం, కచేరీల కోసం, పూల దండల కోసం ఎక్వైర్ చేసుకున్నది. తనది కానిది, బయటి ప్రపంచానిది. నేను ఆ యువకుడికి భవిష్యత్తు వుందీ అంటే అర్థం ఏమిటి? అతని మొదటి కంఠం నశించిపోయి రెండవ కంఠం విన్పిస్తుందనే కదా. అంటే ఆ పసివాడు తనుగా మరణించిపోయి, ఒక వస్తువుగా ఇన్‌స్ట్రుమెంట్‌గా పైకి వస్తాడనే కదా. ఆ కుర్రవాడికి భవిష్యత్తు వుందీ అంటే మనిషిగా ఆ గాయకుడు చచ్చిపోతాడూ అని చెప్పడం అన్నమాట.

## జైలు కిటికీ!

ఎప్పుడో ఎగిరిపోయిన నిద్ర
మళ్ళీ కనురెప్పల కొమ్మల్లో వాలలేదు
ఎన్ని ఆలోచనల యోజనాలు నడిచినా
ఈ రాత్రి ఆఖరు మైలురాయి కనబడ్డంలేదు
బయటినుంచీ ఎవరో కిటికీ మూసేసారు
సన్నని సందులోంచీ కారిన వెన్నెల చుక్క
మెతుకుల్లేని గిన్నెలోపడి చెదిరిపోయింది
ఎక్కడో నిశ్శబ్దాన్ని బద్దలుకొట్టిన ఆక్రందన
నా గుండెను రెండు కన్నీటిబొట్లుగా కోసింది.
నా కళ్ళ మీద లాఠీతో కొడుతూ
నా చెవులమీంచీ సెంట్రీ బూట్లు వెళ్ళిపొయ్యాయి
వొళ్ళంతా టార్చర్ బాధ సలుపుతుంది
ఎప్పుడో నా భార్య తల ఆన్చిన నా భుజమ్మీద
ఆమె కురుల పరిమళం కొండంత బరువెక్కుతుంది
నా పసిపిల్లలు పట్టుకుని నడిచిన నా చిటికెనవేలు
వాళ్ళ మృదువైన అరచేతులంత
వాళ్ళ అమాయకపు ప్రేమంత గాయమయ్యింది
నా గదిలోని చీకటిని చూసినపుడల్లా
నన్ను తనివిగా చూడని, వాళ్ళ నల్లని కనుపాపలు గుర్తుకొస్తాయి
నా శరీరమ్మీది నొప్పులు నిద్రపోయాయేమోననీ
నేనున్న సెల్ ముందర రెండు కళ్ళు బరిసెల్లా వెదుకుతాయి
టెలిఫోన్ స్తంభాలకు చెవిపెట్టి విన్నట్టు
నేను కళ్ళుమూసుకుని గోడకొరుగుతాను
దేన్నో ధ్వంసం చేయటానికి బయలుదేరినట్టు
ఎక్కడినుంచో పరుగెత్తుకొస్తున్న పాదాల సవ్వడి వినబడ్తుంది
ఎందరెందర్నో నిద్రలేపటానికన్నట్టు
అలలు అలలుగా పాట వినబడ్తుంది
బహుశా! అది నా కొరకే ననుకుంటాను!
కళ్ళు విప్పి చూస్తే కిటికీ తెరిచి వుంది
కిటికీ నుంచి దూకిన వెల్తురు
నా సంకెళ్ళు తెగిపోయేలా కౌగిలించుకుంది

— ఆశారాజు

మానవ లోకంలో మన భాషకి ఎంత చిత్రమయిన పరిణామం వుందో!

"నేను తాగుతున్నానూ అంటే, నేను చస్తున్నాను అని కదా. కానీ నేను తాగుతున్నానూ అంటే నేను మనిషిగా బతుకుతున్నానూ అని. ఇందాకా ఆ దేవత ఇంట్లో ఫొనెటికల్ గ్రామర్. నువ్వు కొని ఇచ్చావు కదూ. భాషకి వున్న మూలాధారం ఇదీ. నువ్వు ఎంత ఆదర్శవంతమయిన భాషని మాట్లాడు. కాని దానికి వున్న దేహ ప్రాతిపదికని విస్మరించలేవు. నువ్వు నీ భావోద్వేగాల్తో ఎంత సుందరమయిన ఆదర్శాన్నయినా ఏర్పరచుకో. కానీ అన్నిటికన్నా ముందు, నీ శరీరంలోనే ఆ ఆదర్శానికి ఆస్కారం వుందో లేదో చూసుకో"

ఆయన చటుక్కున లేచి నిలబడ్డారు. కాని తూలిపడబోయారు. రెండు చేతుల్తో ఆయన్ని పట్టుకున్నాను.

"నీకు తెలుసునా. ఐ హేట్ డ్రింక్. ఐ హేట్ డ్రంకర్డ్స్. బాస్టర్డ్స్

# ఏదో జరగాలి

ఏదో అద్భుతం జరిగి—
కన్నీళ్ళతో అలసిపోయిన కళ్ళ వాకిళ్ళలో
కలల చిరుజల్లు కురవకూడదా?
కష్టాల కడగళ్ళతో కరడుగట్టిన మనసు లోగిలిలో
ఆనందాల హరివిల్లు విరియకూడదా?
ముళ్ళబాటలో నడిచి నడిచి సొలసిన జీవితంలో
మరో మధురిమ అడుగిడకూడదా?
హృదయాన్ని ఆవరించిన జడత్వం వదలి
జ్ఞాపకాల పాటువెంట బ్రతుకు నావ రాయంచలా
నడవగూడదా?
గుండెను కదలలేనంత భారంతో నింపిన ఈ దుఃఖాన్ని
ఏ అమృత హృదయమో ఒక్క చిరునవ్వుతో



ఎగరగొట్టకూడదా?
ఏ సునేత్రాల మందో ప్రసరించిన శశి కిరణం
ఈ జీవితాన్ని రసప్లావితం చెయ్యకూడదా?
అవధి లేని ఆవేదన రాల్చే అశ్రువుల్ని తుడుస్తూ
ఏ కోయిలో మధుర మధుర భవిష్యత్కాల
కంఠకూజితాల్ని వినిపించకూడదా?
ఆశ శ్వాస ఆగిపోతున్న తరుణంలో-
మబ్బులాగా- మసకలాగా మరల మరల రాకూడదనుకునే
విషాదం చివర ఎవరో దాగకూడదా?
ఒక మనసుని - ఒక కొత్త పాటని తేకూడదా?
గాయమే మధుర గేయం కాకూడదా?
ఆశయాల లతలు నేలకూలిన హృదయ తమాల
కాననంలో
ఏ ఆమనో ఒక క్రొత్తదనాన్ని- శుభోహరత్వాన్ని
ప్రసాదించకూడదా?
బ్రతుకుని భవ్యంగా మలచకూడదా?
పాత తోటలో ముళ్లే తప్ప గులాబీలు లేవా?
పాట బాటలో రాళ్ళే తప్ప రాజమార్గం లేదా?
ఆనంద సందోహాలు లేవా? రాగవల్లరులు లేవా?
ఎవరో రావాలి — ఏదో జరగాలి
అవును - ఏదో జరగాలి!
రసవత్తర దృశ్యంలో ఆగిన కల తిరిగి ప్రారంభం కావాలి!

—'విశారద'

వీళ్ళంతా. తాగుబోతు వెధవలు'' ఆయన కళ్ళల్లో మళ్ళీ నీళ్ళు. ఏడుపు మినహో. ''కానీ నేను తాగుతాను, తాగకుండా వుండలేను. ఎందుకంటే నేను డ్రంకర్డ్‌ని కాను కనుక. బాస్టర్డ్‌ని కాను కనుక''

బయటికి వచ్చాం.

వెన్నెలకి తడిసిన రెండో జాము రాత్రి.

అది విజయ నగరమనే మర్చిపోయాన్నేను. పారిస్‌లోనో, వెనిస్‌లోనో ఏ మద్యశాల ఎదటనో తాగి తాగి లాంతరు స్తంభానికి వురేసుకున్న ఏ మహాకవుల ఆత్మలో మమ్మల్ని పలకరించినట్టు అన్పించింది. ''అర్థరాత్రి తెలియని దేశాల వింత నగరాల హోటళ్ళలో మద్యం సేవించింది నేను. ప్రేమించబడ్డది నేను, శపించబడ్డది నేను'' కలవరింతలాగా ఒక కవితా వాక్యం.

''ఇంటికి'' రిక్షా పిలిచాను.

''రేపు సాయంకాలం కదూ'' ''కాదేమో, ఇవాళ సాయంకాలమే'', వాచీ చూసుకుంటూ ''ఆ పాప పుట్టిన రోజు. రమ్మని పిలిచిందామె. వెళ్ళాలి కదూ. వెళ్ళకపోతే ఎలా'' మత్తుగా గొణుక్కున్నారు.

ఆశ్చర్యపోయాన్నేను. ఆమె ఆహ్వానాన్ని ఆయన అంత సీరియస్‌గా తీసుకుంటా రనుకోలేదు.

''కాని నిజంగా నేను రాగలనా? మైసెల్ఫ్. ఎ గ్రేట్ సిన్నర్... మీ ఇంటికి రాలేనయ్యా నేను'' ఒళ్ళంతా గగుర్పొడిచింది నాకు 'మీ ఇంటికి'' అన్న మాట విని. కెరటాలు కెరటాలుగా విరుద్ధ భావాలు అనేకం ఒక్కసారి మనసులో దొర్లిపోయాయి.

''ఆ బంగారు పాపకీ, ఆ బంగారు పాపని కన్న బంగారు తల్లికీ నా కోటి ఆశీస్సులు'' చెమటకి ముద్దగా తడిసి పోయిన లాల్చీలోంచి పర్స్ తీసి చేతికందినన్ని నోట్లు బయటికి లాగారు. ''ఇదిగో, నీకు నచ్చిన మంచి కానుక తీసుకు వెళ్ళు. నీకు నచ్చితే నాకు నచ్చినట్టే''

నిర్జన రాత్రి ఆ ముసలి వీధుల మధ్య నుంచి కీచుమంటూ రిక్షా నడుస్తోంది. ఒంటరిగా గంట స్తంభం గుడ్లప్పగించి చూస్తోంది.

''నేను తెల్లవారు ఝామునే వెళ్ళిపోతాను. వాళ్ళు కారు పంపిస్తామన్నారు. ఈసారి వీలు కాలేదు గానీ ఎప్పుడేనా నేను మళ్ళీ ఇటు రాగలిగినప్పుడు ఒకసారి అడవి ప్రాంతానికి వెళ్దాం. అడవిలో వెన్నెల రాత్రి ఏ కొండ మీదనో గిరిజన స్త్రీలు పాడే పాట వినాలని వుంది... తీసుకు వెళతావా''

3

రోజులకి రోజులు ఏ పనీ లేకుండా నిస్సారంగా గడుస్తాయి. ఎన్నో రోజుల్లో ఒక్కరోజు ఎంతో ముఖ్యమయిందిగా వస్తుంది. ఆ ఒక్కరోజే ఎక్కడలేని పనులూ, ఒత్తిడీ వచ్చి పడతాయి. నువ్వు తప్పించుకుందామనుకున్నా తప్పించుకోలేని బాధ్యత లేవో చుట్టుకుంటాయి.

ఆ రోజు అలానే జరిగింది. కాలేజి మానేజ్‌మెంట్ ఒక ఎమర్జన్సీ స్టాఫ్ మీటింగ్ పెట్టింది. కరస్పాండెంట్ నన్ను ఒకటి రెండు తీర్మానాలు డ్రాఫ్ట్ చేసి చూపించమన్నాడు. మనసు మనసులో లేకుండా అదంతా పూర్తి చేసి ఆ అలసటలోనే ఆ ఇంటి ముందుకి ఒక్క పరుగున వచ్చి పడ్డాను.

కాని అప్పటికే చాలా ఆలస్యం. పార్టీ దాదాపుగా అయిపోవచ్చింది. గెస్టులు కూడా ఎక్కువ ఎవరూ లేరు.

వాళ్ళ ఇన్‌స్టిట్యూట్ మనుషులూ, కాలనీలో చుట్టుపక్కల వాళ్ళూ, శ్యామల తల్లి తండ్రులూనూ.

నన్ను చూడగానే శ్యామల ముఖంలో బాధ స్పష్టంగా కనబడింది. తక్కిన రోజుల్లో నువ్వు ఎంత సేపు గడిపినా, ఇటువంటి ముఖ్యమయిన రోజున నువ్వు దగ్గర లేకపోతే ఆ రోజు అన్నిటికన్నా పెద్దదిగా అన్పిస్తుంది. నీకూ తనకీ మధ్య ఈ

మనుషులందరూ చేరడంతో కలిగిన దూరం ఈ లోటుతో మరీ పెరుగుతుంది. నిజమే, ఈ ఏర్పాట్లన్నీ నేను దగ్గరుండి చూడాల్సినవి. కాని ఎవరో నాకే ఒక కుర్చీ తీసుకు వచ్చి వేశారు. ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ గారు ఏదో మర్యాదా పూర్వకంగా సంభాషణ మొదలు పెట్టేలోగా, గాలి తెరలు కదలినట్లుండే అడుగుల్తో నా దగ్గరగా వచ్చి నిలబడి 'ఇదిగో రాజా , పాప' అని చూపించి పళ్ళెంతో అక్షింతలు అందించింది.

తడబడిపోతూనే పాపని చూశాను. 'ఓ మై డివైన్ డాల్' అని మాత్రం అనగల్గి, రెండు చేతుల్తో దగ్గరకు తీసుకున్నాను. అక్షింతలు చల్లి ఎత్తుకున్నాను. నా ఒళ్ళంతా పులకరించి పోయింది. శ్యామలని చిన్నప్పుడు వాళ్ళ నాన్న ఎత్తుకున్నప్పుడు అలానే ఒళ్ళు పులకరించి వుంటుందేమో అతనికి. ఒక మనిషి దేహం నీలో వుండే దివ్యత్వాన్ని మేల్కొల్పడం నిజంగా అద్భుతంగా వుంటుంది. కాని ఒక్క పసిపిల్లలకేనా యీ మహత్యం?

నెమ్మదిగా స్ఫురించింది నాకు. పాప రెండు కళ్ళకీ పార్థివమయిన చూపులేదని. పాపని కన్న తండ్రి పాశవికమయిన వాంఛల బ్లైండ్‌నెస్— అసలు పురుష దేహాలన్నిటి బ్లైండ్‌నెస్ నన్నా సమయంలో సిగ్గు పరిచింది. 'మన అన్ని హింసలకీ విక్టిమ్స్ స్త్రీలు, మన పిల్లలని చూస్తే మనకి ఇదే బోధపడుతుందని' అన్న మాటలకి అర్థం ఇప్పుడు బోధపడింది. నేనూ ఓ పాపకి తండ్రిని కాగలనా? తన మనో దేహాత్మలన్నీ లోప రహితంగా రూపు దిద్దుకునే ఓ బిడ్డని కనగలనా? అట్లాంటి లోపరహితమయిన శిశువుని ఏ తల్లి నా కోసం కనగలదు?

"ఈమె మా అమ్మగారు. ఈయన మా నాన్న" శ్యామల తన తల్లి దండ్రుల్ని పరిచయం చేసింది. పెద్దగా చదువుకోని, లోకజ్ఞానం లేని ఆ పల్లెటూరి దంపతుల ఏ నిష్కల్మష పరిష్వంగం శ్యామలలాంటి స్త్రీని ఈ లోకానికి తీసుకు వచ్చిందో కదా అనుకున్నాను. కాని లోకానికి ఇచ్చిన ఒక నిర్మలమయిన వరం లాంటి శ్యామలకు లోకం నిజంగా ఏమివ్వగలిగింది?

లోకం చేతిలో శ్యామల పడే హింసని నేను ఇంకా అధికతరం చెయ్యడానికే వచ్చానో లేక ఆపడానికే వచ్చానో తెలుసుకోవడం నా వల్ల కాదనిపించింది. నేను ఇంత వరకూ చూసి వుండని ఆ పల్లెటూరి దంపతులు నా జీవితంలోకి ప్రసరించిన ఎంత కాంతికి కారణమయ్యారు!

పార్టీ ముగిసి ఒక్కొక్కళ్ళే సెలవు తీసుకుంటున్నారు. బయట చెప్పుల్లో తన చెప్పుల్ని వెతుక్కొంటో ఇన్‌స్టిట్యూట్ లెక్చరర్ ఒకాయన "మీరు వచ్చేదాకా శ్యామల మీ కోసం ఒకటే ఎదురు చూసింది" అంటున్నాడు. ఇక మొదలు. లోకానికి ఒక సరికొత్త స్కాండల్.

నేను పైన బాల్కనీలో ఒంటరిగా మిగిలి పోయాను. అన్ని పనులూ పూర్తి చేసుకుని శ్యామల పైకి వస్తుందని, ఆ పద ధ్వని ఎదురుచూస్తూ. సన్నజాజి గుబురంతటా గుసగుసలాడినట్లు మొగ్గలు విప్పుకున్నాయి.

నిన్నటి రాత్రి వి.ఎస్.తో గడిపిన కాలమంతా ఎప్పుడో గడిచిన దాని స్మృతిలాగా తోచింది. నా రహస్య మనోలోకాలన్నిటినీ కదిపి వెళ్ళి పోయాడాయన. ఆయన మాటాడిన మాటలు ఒక్కొక్కటే గుర్తు వస్తుంటే చెప్పలేనంత భయం కలిగింది.

వి.ఎస్. యాంబిషన్‌ని జయించిన వ్యక్తి. కుప్పలు కుప్పలుగా పోగుపడే ఈ భౌతిక వస్తుజాలం మధ్య మనిషి ఒక కమాడిటీగా, ఇన్‌స్ట్రుమెంట్‌గా మారుతూ మనిషిగా మరణించాల్సి రావడం జయించలేని తన యాంబిషన్ వల్లనే - ఇదే కదా నిన్నంతా ఆయన మొత్తుకున్నది.

యాంబిషన్, దాని వల్ల వచ్చే కాంపిటీషన్, దానివల్ల పెరిగే వయొలెన్స్‌లేని మనుష్య సమాజం సాధ్యమేనా? ఏ ఇద్దరు స్త్రీ పురుషుల మధ్యనేనా వుండవలసిన కనీస మానవ సంబంధమేనా దాని ఛాయలు పడకుండా తప్పించుకోగలదా?

విశాఖపట్నంలో సింధియాలో మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌గా ఉద్యోగం వస్తే వెళ్ళకుండా వుండగలనా? ఇంక యాంబిషన్‌ని జయించిన వి.ఎస్. నిజంగా అడవికి పోయి గిరిజన గీతాలు వింటూ జీవించగలడా? మన ఆదర్శాలకి ఎక్కడో, మన జీవిత ప్రాతిపదికలోనే ఆధారం తప్పింది.

దూరంగా రైలు కూసింది. చాలా పొద్దు పోయింది. లేచి కిందకి దిగివచ్చాను. అంతా నిశ్శబ్దంగా వుంది. గదిలో ఒక పక్కన శ్యామల తల్లి దండ్రులు, పాప అట్లానే నిద్రపోతున్నారు. తలుపులు వేసుకోవడం కూడా మర్చిపోయారు. ఫ్లోరసెంట్ దీపం ఆర్పకుండా అలానే వెలుగుతోంది. స్విచ్ ఆఫ్ చేసి తలుపులు దగ్గరగా మూసి శ్యామల కోసం చూశాను. ఆమె వంట గదిలో అలసటగా ఒక వారగా ముడుచుకుని నిద్రపోతోంది.

దగ్గరగా కూచుని "శ్యామూ" అని పిలిచాను.

ఆమె మగతగా కళ్ళు విప్పి నన్ను చూసి, రెండు చేతులూ నా మెడ చుట్టూ వేసి మళ్ళీ నిద్రలోకి జారి పోయింది.

ఆ క్షణాన్న, ఆ అర్ధరాత్రి, ఆ ఇరుకు గదిలో మా జీవితాలు ఒకదానికొకటి విడదీయ లేనంతగా పెన వైచుకు పోయాయనిపించింది నాకు. కాని ఆ క్షణాన్నే మా ఇద్దరి మధ్యా దాటరానంత దూరం వుందనీ, దాటేందుకు చేసే ఏ చిన్న ప్రయత్నమయినా మమ్మల్ని చెరో వేపుకూ విసిరేసి ఆ దూరాన్ని అధికాధికం చేస్తుందని కూడా తెలిసింది నాకు.

జీవించినంత కాలం ఈ వేదనకి అంతం లేదనిపించింది.

నెమ్మదిగా ఆమె చేతుల్నుంచి విడిపించుకుంటూ "శ్యామూ, శ్యామూ" మళ్ళీ లేపాను. అతి ప్రయత్నం మీద కళ్ళు విప్పింది. ఆ కళ్ళల్లో విపరీతమయిన అలసట. ఈ లోకం స్పృహలోనే లేదసలు.

నేనేదో అడిగేటంత లోనే "నీకు అన్నం పెట్టమని చెప్పాను అమ్మకి, పెట్టిందా? తిన్నావా?" అని అడిగింది.

ఎలా తినగలను? ఏమనగలను? బయట సన్నజాజులు, వెన్నెల, మహా మధురమయిన గాలులు. ఆమెని మాట్లాడనివ్వకుండా అట్లానే దగ్గరకు తీసుకుని మృదువుగా కావిలించుకున్నాను. ఆ చీకట్లో ఆ కావిలింతలో ఈ లోకంలోని ఏ చూపులకీ లేని అపురూపమయిన దివ్యత్వస్ఫురణని దేన్నో ఇద్దరం ఆ క్షణాన్న నిశ్శబ్దంగా అనుభవిస్తూ వుండిపోయాం. ●

## ఒక మాట

ఈ పూట ఏ మాటకూ జన్మనివ్వలేను
నిండుదనం సంతరించుకోబోతున్న మాటను మధ్యనే
పుటుక్కున తెంపి విడుదల చేయడం అబార్షన్
నాలో సుళ్ళు తిరగని జీవితాన్ని ఆవిష్కరించలేను
నేనే ఆనవాలు పట్టలేని ముఖాన్ని నీకై చిత్రించలేను
సంచలన సృష్టికోసం, ఉద్వేగ వృష్టి కోసం అంటూ
అబద్ధం అక్షరాల్ని మాటగా పులిమి
నిన్ను నివ్వెరపరిచి నన్ను నేను హత్య చేసుకోలేను
మౌనించనీ ఈ పూట
మౌనంలో నేను మహాపురూపంగా మహాభిమానంగా
కౌగిలించుకునే మాటను గుండె భరిణెలో
పదిలంగా పవిత్రంగా రూపుదిద్దుకోనీ
మౌనం మాటకు ముందు విరామ సంగీతం కాదు
నిజానికి అది నిర్మాణ సంగీతం
ఈ పూట కాకపోతేనేం మిత్రమా
రేపైనా మరునాడైనా నాలోంచి
మాట నిండుగా అభయాక్షరమాలగా అర్థవంతంగానే
పరుగిడి రానీ! —దర్భశయనం శ్రీనివాసాచార్య